వైభవంగా సుదర్శన నారసింహ హోమం

సువర్ణ పుష్పార్చనలో స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూలై 10 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. సుమారు ....వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. ....ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరి కొండపైన మరో 15దుకాణాలకు అనుమతి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- యాదగిరిగుట్టలో క్యూలైన్లు, సులభ్ కాంప్లెక్స్ ప్రారంభం

క్యూ లైన్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూలై 10 : యాదగిరిగుట్ట కొండపైన మరో 15 దుకాణాలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. భక్తుల సౌకర్యార్థం దుకాణాలకు అనుమతినివ్వక తప్పడం లేదని, దుకాణాల కేటాయింపుపై అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని అన్నార. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామిని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికి, ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో గర్భాలయానికి ఎదురుగా స్వయంభూ నారసింహస్వామి చాలా సేపు కనిపించే విధంగా ఏర్పాటు చేసిన ర్యాంప్‌తో కూడిన క్యూలైన్లు, కొండపైన బస్టాండ్ వద్ద నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత దేవస్థానం అధికారులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొండపైన 112 దుకాణాలు ఉండేవని, ప్రస్తుతం 10 మాత్రమే ఉన్నాయని అన్నారు. వాటికి మరో 15 దుకాణాలను పొడిగిస్తూ మొత్తం 25 దుకాణాలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించారు. అన్నదాన సత్రంలో ప్రస్తుతం రోజుకు వెయ్యి మంది భక్తులు భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేశామని, ముున్ముందు 5వేల మందికి చేయబోతున్నామని చెప్పారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు సకల వసతులను కల్పిస్తామన్నారు. ఆలయాన్ని గొప్పగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జన్మదినం, వివాహ మహోత్సవ వేడుకల సందర్భంగా భక్తులెవరైనా స్వామివారి ఆలయంలో గల అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. గత ప్రభుత్వం ఆలయాన్ని అద్భుతంగా నిర్మించినా మౌలిక వసతుల కల్పనలో విఫలమైందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కొండపైకి వచ్చే భక్తులకు సకల వసతులు కల్పిస్తామని తెలిపారు. అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఈఈ దయాకర్ రెడ్డి, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈఓలు రమేశ్ బాబు, రఘు, జూశెట్టి కృష్ణ, ఆలయ అధికారులు రాజన్‌బాబు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

మోటకొండూరు, జూలై 10 : వన మహోత్సవంలో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, డీటీ సురేశ్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ యశోద, ఎంపీఓ కిషన్, ఏపీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శులు సాయికుమార్, శ్రీకాంత్, కోటేశ్, శ్రీనివాస్, రామకృష్ణ, సోఫియా, భవానీ పాల్గొన్నారు.

హైస్కూల్‌లో విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ సందర్శన

దూదివెంటాపురం హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ మదన్‌మోహన్

రాజాపేట, జూలై 10 : మండలంలోని దూదివెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ మదన్ మోహన్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, పాఠాలు బోధిస్తున్న తీరును ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రహరీ అవసరమని రీజినల్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, తాగునీరు, పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ మీద సలహాలు, సూచనలు చేశారు.

కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకుంటాం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

రసాయన జలాలను పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 10 : కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల పరిధిలోని కెమికల్ కంపెనీల్లో బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఫార్మా కంపెనీల వల్ల జల, వాయు కాలుష్యంతో అంతుచిక్కని రోగాలతో బాధపడుతున్నామని, తమకు రక్షణ కల్పించాలని కొన్ని రోజులుగా వినతులు వస్తుండడంతో ఎంపీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్‌జీటీ ప్రమాణాలకు లోబడి కంపెనీ నడుపుతున్నారా? అనే విషయాలపై జిల్లా కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో మాట్లాడి 14 రోజుల్లో తమకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. కాలుష్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

సమయానికి రైళ్లను నడుపాలని వినతి

ఆలేరు రూరల్ : సికింద్రాబాద్ – కాజీపేట మధ్య నడిచే రైళ్ల ఆలస్యాన్ని నివారించి నిర్ణీత వేళలో నడిచేలా చూడాలని కోరుతూ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి బుధవారం పలువురు నాయకులు వినతి పత్రం అందజేశారు. కాకతీయ, ఫలక్‌నుమా, పద్మావతి రైళ్లను సకాలంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ ఎజాజ్, వెంకటేశ్వర్‌రాజ్, లోకేశ్, భాస్కర్, శ్రీధర్, కాసుల భాస్కర్ పాల్గొన్నారు.

భద్రాచలం హైవే నిర్మాణానికి రైతులు సహకరించాలి

- చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి
- తగిన పరిహారం ఇవ్వాలని రైతుల వినతి


రైతులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 10 : గౌరెల్లి టు భద్రాచలం (ఎన్‌హెచ్ 930) జాతీయ రహదారికి రైతులందరూ సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ధర్మారెడ్డిపల్లి, వంకమామిడి గ్రామాల రైతులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భూములు కోల్పోతున్న రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రస్తుత మార్కెట్ వ్యాల్యూ ఎకరానికి రూ.80 లక్షలు ఉన్నదని, ప్రభుత్వం రూ.24 లక్షలు మాత్రమే ఇవ్వడం సమంజసం కాదని రైతులు పేర్కొన్నారు. తాము చిన్న రైతులమని, ఉన్నదంతాపోతే ఎట్లా బతుకాలని, భూములు కోల్పోతే తాము వీధిన పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ సర్వే ప్రకారం భూములు, చెట్లు, కట్టడాలకు డబ్బులు ఇస్తారని.. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఎకరానికి రూ.24లక్షల నుంచి 28లక్షల రూపాయల వరకు ఇస్తారని తెలిపారు. ధర్మారెడ్డిపల్లిలో 16ఎకరాల 14 గుంటలు, వంకమామిడి గ్రామ పరిధిలో 20 ఎకరాల 20 గుంటల భూమి కోల్పోతున్నారని, రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. రైతుల అభిప్రాయాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. అనంతరం ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, సర్వే సాయి, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సామ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులకు అండగా రాష్ట్ర సర్కారు

- రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ సాయికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ సాయికుమార్

భువనగిరి అర్బన్, జూలై 10 : రాష్ట్రంలోని మత్స్య కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటూ ఆదుకుంటుందని రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. జిల్లా మత్స్య కార్మిక శాఖ ఆధ్వర్యంలో మత్స్య కృషివలుల దినోత్సవాన్ని పట్టణంలోని పశుసంవర్థక శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్స్యకారులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, చెరువుల్లో చేప పిల్లల పంపిణీ చేపట్టాలని మత్స్య కార్మికులు కోరారు. అనంతరం జిల్లా మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో సాయికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సామల ధర్మరాజు, నాయకులు లక్ష్మణ్, నర్సింగ్‌రావు, అంజన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి : ఎంఈఓ

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బీబీనగర్, జూలై 10 : విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనలు మరువలేనివని ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండమడుగు హైస్కూల్ నుంచి వివిధ పాఠశాలలకు బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులు చిన్న రమేశ్, మల్లయ్య, మెహర్ మంగా, భూపతి రెడ్డి, సబిత, అరుణకు గ్రామ ప్రజలు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు బుధవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, మాజీ సర్పంచ్ లత, మాజీ ఎంపీటీసీ వాకిటి గణేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడిగా కిష్టయ్య

ఆత్మకూరు(ఎం), జూలై 10 : గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నోముల స్వామిగౌడ్, అధ్యక్షుడిగా కూరెళ్ల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడిగా రాగటి శ్రీను, సహాయ కార్యదర్శిగా సైదులు, కోశాధికారిగా రమేశ్ ఎన్నికయ్యారు.

దవాఖానకు శానిటేషన్ వస్తువులు అందజేత

దవాఖాన సూపరింటెండెంట్‌కు సామగ్రి అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

రామన్నపేట, జూలై 10 : స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు బుధవారం డస్ట్ బిన్‌లు, ఫినాయిల్, తదితర శానిటేషన్ సామగ్రిని సూపరింటెండెంట్ వీరన్నకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ వారు దవాఖానకు అందజేస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాజశేఖర్, ఇంజినీర్ బొడిగే వెంకటేశ్, శంకు, గోవర్ధన్‌రెడ్డి, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ పరామర్శ

కొమురెల్లిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం), జూలై 10 : మండలంలోని పారుపల్లిలో అబ్బాస్ తల్లి ఇటీవల మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన దయ్యాల కొమురెల్లి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం బాధితుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పరామర్శించారు. ఆయన వెంట గ్రామ నాయకులు రంగయ్య, నర్సయ్య, సోమరాజు, మల్లారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

విద్యుత్ కోతలతో రైతులకు తిప్పలు : బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఉప్పలయ్య

ఆత్మకూరు(ఎం), జూలై 10 : కాలం కాకపోవడంతోపాటు కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాషబోయిన ఉప్పలయ్య అన్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే అన్ని రకాల పెన్షన్లు పెంచి ఇవ్వాలని, రైతులందరికీ ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, రైతు విభాగం మండలాధ్యక్షుడు పుట్ట నర్సిరెడ్డి, నాయకులు రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

జిట్టోళ్ల బావిలో ట్రాక్టర్ చోరీ

భువనగిరి కలెక్టరేట్, జూలై 10 : పొలం వద్ద ఉన్న ట్రాక్టర్ చోరీకి గురైంది. ఈ సంఘటన మండలంలోని నమాత్‌పల్లి గ్రామ పంచాయతీ ఆవాసమైన జిట్టోళ్లబావి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, బాధితుడి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జిట్ట రమేశ్‌రెడ్డి తన వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్‌తో మంగళవారం పొలం పనులు చేపట్టాడు. అనంతరం పొలం వద్దే రోటవేటర్‌తో కూడిన ట్రాక్టర్ ఇంజిన్‌ను ఉంచి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లేసరికి ట్రాక్టర్ కనిపించలేదు. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

స్టామ్ వాటర్ డ్రైన్ పనుల పరిశీలన

స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, జూలై 10 : మున్సిపాలిటీ కేంద్రంలో చేపడుతున్న స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం పరిశీలించారు. పట్టణంలో ఎస్‌బీఐ వద్ద ఉన్న మురుగు కాల్వ నుంచి మినీ ట్యాంక్‌బండ్ చెరువులోకి స్టామ్ వాటర్ పోయేందుకు పనులు చేపట్టారు. పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'చేనేత కార్మికుల హామీలు అమలు చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య

మోత్కూరు, జూలై 10 : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాశికంటి లక్ష్మీనర్సయ్య, గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మశాలి కాలనీలో బుధవారం జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలపై నేతన్న పోరు యాత్ర పేరుతో చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు పసునూరి యాదయ్య, ఏలూరి మత్స్యగిరి, రేగటి శ్రీను, నారాయణ, చంద్రమౌళి, రాజారామ్ పాల్గొన్నారు.

హైవేపై రోడ్డు ప్రమాదం

చౌటుప్పల్ రూరల్, జూలై 1 : మండలంలోని రెడ్డిబావి గ్రామం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులో విజయవాడ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దాంతో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యానగర్‌లో భగవద్గీత పారాయణం

గవద్గీత ప్రవచనాలు వినిపిస్తున్న మాతా సరోజినీదేవి

చౌటుప్పల్, జూలై 10 : పట్టణంలోని విద్యానగర్ కాలనీలో సర్వేజనా సుఖినోభవంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా సరోజినీదేవి భగవద్గీత ప్రవచనాలను వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలన్నారు. తమ పిల్లలకు ఈ పుస్తకం చదవడం నేర్పించాలని పేర్కొన్నారు. భగవద్గీత పఠనంతో కుటుంబ జీవన విధానం, ధర్మం, న్యాయం తెలుస్తుందని చెప్పారు. పిల్లలు చెడు మార్గం అనుసరించకుండా మంచి జీవిత విధానం అనుసరిస్తారని తెలిపారు. అంతకుముందు శ్రీకృష్ణభగవాన్ విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు పాలకూర్ల పాండు, యోగా సాధకులు ధనలక్ష్మి, శ్రీలత, రజిత, పద్మావతి, నీరజ, శ్రీలత, శోభారాణి, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మాట్లాడుతున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్తిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 10 : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి అన్నారు. మండలంలోని బీఎన్ తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రచ్చ మల్లికార్జున్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలు బోధించడంతోపాటు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉడుత శారద, పాఠశాల చైర్మన్ ఉడుత కవిత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బోడ విద్యాసాగర్, ఉపాధ్యాయులు యాకుబ్ చారి, గఫార్, లింగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, షాహిన్‌బేగం, నిర్మల, అరుణ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- రోటరీ క్లబ్ సెంట్రల్ జిల్లా గవర్నర్ రాంప్రసాద్

తాజ్‌పూర్‌లో వైర్‌లెస్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సెంట్రల్ జిల్లా గవర్నర్ రాంప్రసాద్, ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, జూలై 10 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని రోటరీ క్లబ్ సెంట్రల్ జిల్లా గవర్నర్ రాంప్రసాద్ అన్నారు. మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో రోటరీ క్లబ్ డైరెక్టర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ ఏర్పాటు చేసిన 16 వైర్‌లెస్ సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, క్లబ్ భువనగిరి అధ్యక్షుడు అనీఫ్ రెహమాన్, గవర్నర్ సింగమోని నర్సింగ్‌యాదవ్, న్యూ క్లబ్ చైర్మన్ ఎంపల్ల బుచ్చిరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ ఎంపల్ల వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుమంత్ రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సురేశ్, సంతోష పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- తాసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన

ఆలేరు రూరల్/ రాజాపేట/ అడ్డగూడూరు, జూలై 10 : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం తాసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆలేరు తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రిటైర్మెంట్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాజాపేట తాసీల్దార్ కార్యాలయ వద్ద అంగన్‌వాడీ టీచర్లు నిరసన తెలిపారు. అనంతరం తాసీల్దార్ దామోదర్‌కు వినతి పత్రం అందజేశారు. అడ్డగూడూరు తాసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించి డిప్యూటీ తాసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ఆత్మకూరు(ఎం)/ రామన్నపేట/ భూదాన్ పోచంపల్లి : కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా పెండింగ్ జీతాలు విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివిధ రంగాల కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రామన్నపేట తాసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి తాసీల్దార్ లాల్‌బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. పోచంపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

రామన్నపేట : తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు


ఆత్మకూరు(ఎం) : ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్‌కు సన్మానం

రాజాపేట, జూలై 10 : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా ఎంపికైన సట్టు తిరుమలేశ్‌ను పార్టీ మండల నాయకులు బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగిర్తి జనార్దన్‌రెడ్డి, దేవులానాయక్, లక్ష్మణ్‌నాయక్, రాములునాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

తిరుమలేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రమేశ్‌కు 'మాదిగ ఉద్యమ వీరుడు' అవార్డు

ఆత్మకూరు(ఎం), జూలై 10 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన ఎమ్మార్పీఎస్ రజతోత్సవ వేడుకల్లో మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్‌కు మాదిగ ఉద్యమ వీరుడు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, వేముల వీరేశం, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి రమణ, జిల్లా నాయకులు చిప్పలపల్లి యాదగిరి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభానికి ఉత్తర్వులు

బీబీనగర్, జూలై 10 : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో టికెట్ రిజర్వేషన్ కౌంటర్ కొంతకాలంగా పనిచేయడం లేదు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన ఆయన రైల్వే అధికారులతో మాట్లాడారు. రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభించడానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక నాయకులు గోలి నరేందర్‌రెడ్డి తెలిపారు.